# ఇన్లాండ్ లెటర్ కథలు

## 'ఎక్స్‌పోజింగ్'

'హడావుడి'గా ముస్తాబవుతున్న 'పెళ్ళికూతురి'లా ఉంది బస్టాండ్ ఉదయం 8 గంటలకే! ఆదిత్యకి అది రోజూ అలవాటైన వాతావరణమే. అప్పుడే 'నాన్‌స్టాప్' బస్ వెళ్ళినట్లుంది. కౌంటర్ ఖాళీగా ఉంది. మరో అర గంటదాకా ఈ 'ఎదురు చూపులు' తప్పవు.

బస్టాండ్‌లో ఓ మూలఉన్న బడ్డీకొట్టు దగ్గరకు వెళ్ళి సిగరెట్ పాకెట్ తీసుకుని 'విజయవాడ' ప్లాట్‌ఫామ్ దగ్గరకు వచ్చి సిగరెట్ వెలిగించి దమ్ము లాగాడు. పి.జి.అవంగానే ఓ ప్రైవేటు ఫర్మ్‌లో చేరి రెండు, మూడు సంవత్సరాలలోనే తన ప్రతిభ నిరూపించుకొని 'ఎగ్జిక్యూటివ్' స్థాయికి ఇవుడు చేరాడు. ఆదిత్య సమాజం పట్ల 'రెస్పాన్సిబిలిటీ' ఫీలవుతుంటాడు. ఏటికి ఎదురీదే అతని స్వభావం ఎన్నో చిక్కుల్ని తెచ్చిపెట్టినా తన వైఖరిని ఇంతవరకు మార్చుకోకపోవడం అతని వ్యక్తిత్వానికి మరింత శోభను చేకూర్చింది.

కొద్దిసేపట్లో బస్ వచ్చింది. ఉన్నది తక్కువ మంది అయినా జనాలు ఒకర్నొకరు తోసుకుంటూ బస్ ఎక్కుతున్నారు. ఆదిత్య హడావుడి సద్దుమణిగాక మిగిలిన వెనుక సీట్లో కూర్చున్నాడు. జీవితంలో ఎన్నో అఘాకర్యాలను ఓర్పుగా భరించే ఈ జనాలు ఓ గంట ప్రయాణంలో ఎంతో సౌఖ్యాన్ని పొందాలన్న వారి ఆరాటం అతనికి ఎపుడూ వింతగానే ఉంటుంది.

ఇంతలో ఆదిత్య పక్కనే ఓ నడివయసు భారీ కాయం వచ్చి కూలబడింది. కాసేపటి తర్వాత ఆరోజు న్యూస్ పేపర్ తీసి కొంచెం పెద్దగా చదవడం ప్రారంభించినది. 'కాలేజీ యువతి' 'గాంగ్ రేప్' అని అతను పెద్దగా చదివిన వార్త ముందు, వెనుక సీట్లలోని వారిలో కొద్దిపాటి కదలిక తెచ్చింది.

'పేపర్లలో ఈమధ్య ఎక్కడ చూసినా ఈ 'రేప్' వార్త లేనండి' అంటూ పేపర్ మడిచి నిట్టూర్చింది ఆ భారీ కాయం. 'జనాల్లో నైతిక విలువలు పడిపోయాయండి' సీటుకోసం చేసిన యుద్ధంలో అలసిన ఓ ప్రవక్త వ్యాఖ్యానించాడు. 'కలియుగం నాయనా! అధర్మం వాలుగుపాదాల నడుస్తోంది. వణుకుతూ అంది ఓ ముదిమి వయసావిడ.

ఇంకెన్ని రోజులులెండి మామ్మగారు! 2000 సం.నాటికి ఎటూ కలియుగాంతం తప్పదు గదా! అందో చైన్ స్మోకింగ్ అస్థిపంజరం. 2000 సంవత్సరం వాటికి కలియుగం సంగతిదేవుడెరుగు ఈ పర్సనాలిటీ అప్పటిదాకా బతకడం అసంభవం అని బల్లగుద్ది



మరీ చెప్పొచ్చు అనుకున్నాడు ఆదిత్య.

"ఈ ఆడాళ్ళు మాత్రం తక్కువ తిన్నారటండీ. స్లీవ్‌లెస్ లోనెక్‌లు, వీపంతా కనబడే బ్లౌజ్‌లు, లిప్‌స్టిక్‌ఖు, ట్రాన్స్‌పరెంట్ క్లీట్స్, నడుం మడతలు, బొడ్డు కనిపించేట్లు కట్టే చీరలతో ఎక్స్‌పోజింగ్ చేస్తూ మగాళ్ళకి పిచ్చెక్కించేస్తున్నారు. ఇంక కాలేజీ పిల్లల సంగతి సరే సరి! రేప్‌లు జరుగుతున్నాయంటే జరుగవండి మరి, పరిస్థితులే అలా ప్రేరేపిస్తుంటే మగాళ్ళని అని మాత్రం ఏం లాభం" అంటు మగవాళ్ళ తరవున వకాల్తా వుచ్చుకున్నట్లుగా లెక్చర్ ఇచ్చి కిటికీలోంచి గుట్కా ఉమ్మి అందరివంకా గర్వ ంగా చూశాడో సూడో జీనియస్.

అప్పటిదాకా, ఆ చర్చపట్ల అనాసక్తంగా వున్న ఆదిత్య ఇంక కల్పించుకోలేకుండా వుండలేకపోయాడు. మీరు అన్నది చాలావరకు కరక్టే మాస్టారు! మీ ప్రక్కనే సీటులేకుండా నిలబడ్డ ముసలావిడను చూడండి! ఆమె పరిస్థితికి సీటిచ్చి సాయం చెయ్యమని మనల్ని ప్రేరేపించడంలేదు. రోడ్డుప్రక్కన యాక్సిడెంట్ జరిగినప్పుడు అక్క పరిస్థితులు మనల్ని వారికి సాయం చేయాలన్న కనీస మానవతా 'ధర్మాన్ని ప్రేరేపించడంలేదూ! తెల్లారిలేస్తే మనం అనుభవించేది సావాసం చేసేది అధర్మం, అవినీతి, లంచగొండితనంలతోనే! మరి మనం అలాటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ఎంతమందిమి ప్రయత్నం చేస్తున్నాము. మంచికోసం మార్పుకోసం ప్రయత్నం చేయాల్సిన పరిస్థితులు అనుక్షణం ఎదురవుతున్నా మనం ఎందుకు రియాక్ట్ కావడం లేదు. ఈ ఎక్స్‌పోజింగ్‌కే ఎందుకంత రియాక్టవుతున్నాం?
కారణం మన మగ దురహంకారం. పశుప్రవృత్తికాదా! 'తప్ప'ను నిస్సిగ్గుగా సమర్థించే వాళ్ళు తప్పచేసిన వారికన్నా తక్కువేంకాదు అన్నాడు ఆవేశంగా. తలదించుకున్నాడు తనవాదం తప్ప అని తెలుసుకున్న ఆ "సూడో జీనియస్" ఆదిత్యని పదునెక్కుతున్న వెలుగురేఖల వేడికి మంచుతెరలు తొలగిపోతున్నాయి. బస్సు క్రమంగా వేగం పుంజుకుంటోంది.

—కె.ఎస్.ఎస్.ప్రసాద్. చౌదరి

—అమృతలూర్, గుంటూరు.

## తగినశాస్తి

నిర్మామష్యంగా ఉన్న వీధిలో నడుస్తున్న రవి భుజమ్మీద బరువైన చేయి పడేసరికి తిరిగి చూశాడు. వెనుక కానిస్టేబుల్ సుందర్ నిలబడి వున్నాడు. ఏరా రవీ! ఈ మధ్య కనిపించడంలేదు" సాధారణ ధోరణిలో అడుగుతున్నా రవికి అదో గర్జనలాగే అనిపించింది. అవును! మద్యం 'జీరో సరకు' అమ్ముకునే తనతో పోలీసు అంత ఆప్యాయంగా మాట్లాడితే దాని అర్థమే వేరు! ఏముందండీ! ఈ మధ్యే ఎక్సైజ్ వాళ్ళు రైడ్ చేసి వున్న సరుకంతా ఊడ్చుకువెళ్ళారు. కొంతకాలం మౌనం వహించక తప్పదుగా" బదులిచ్చాడు రవి.

అది సరే, జేబులో చిల్లరేమైనా వుందట్రా! నెలాఖరు కదా బొత్తిగా కరువొచ్చింది.

"అబ్బే లేవండి" నసిగాడు రవి "చాలా అవసరం! తప్పదురా" చొరవగా రవి జేబులో చేయిపెట్టాడు

"అబ్బా! చెప్తుంటే వినరేంటండీ!" విసుక్కుంటూ సుందర్ చేతిని గట్టిగా ఒడిసి పట్టుకున్నాడు రవి

'ఊరుకోరా! జేబులో కొత్త నోట్లు పెరపెరలాడుతుంటే అబద్ధాలు కూడానా?"

రవి చేతిని విదిలించి కొట్టాడుఈసారి!

జేబులో వున్న కొత్త వందరూపాయిల నోట్ల కట్టను బయటకు తీశాడు సుందర్. ఓ అయిదు వందలు తీసికొని మిగలినవి రవి జేబులోనే వుంచాడు. చేసేదేమీ లేక గొణుక్కుంటూ ముందుకు నడిచాడు రవి. అలా కొంతదూరం నడిచి ఓ హోటల్‌లో దూరాడు టిఫిన్ చేసి, డబ్బులివ్వడానికి జేబులో చేయిపెట్టాడు చేతికి ఏదో తగిలినట్లనిపించింది., బయటకు తీశాడు!

"వజ్రవుటుంగరం"!

బలవంతంగా తనజేబులోనుంచి డబ్బులు లాక్కువే ప్రయత్నంలో సుందర్ చేతి నుంచి జారిపడిన వుండడం అది అని అర్థమయిందతనికి. అప్రయత్నంగా చిరునవ్వు విరిసిందతని పెదవులపైన. సుందర్‌కు "తగినశాస్తి " జరిగిందని మనసులోనే నవ్వుకున్నాడు.

—సయ్యద్ కుర్షీద్

—మహబూబాబాద్